సాక్షి
వనపర్తి
ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



ఆరుద్రోత్సవం..

అలంపూర్ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆరుద్రోత్సవం నిర్వహించారు.

వివరాలు 10లో ▸



నెట్టెంపాడుకు నీటి పంపింగ్

నెట్టెంపాడు ఎత్తిపోతలలో భాగమైన గుడ్డెందొడ్డి లిఫ్ట్–1కు నీటిని ఎత్తిపోశారు.

వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /21.9

వాతావరణం

రోజులో అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.



జూపల్లి కృష్ణారావును బలవంతంగా వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

ఉత్కంఠ @ 5 గంటలు

- కాంగ్రెస్ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ సందర్శనలో హైడ్రామా
- కొల్లాపూర్ తదితర ప్రాంతాల్లో పలువురి ముందస్తు అరెస్ట్‌లు
- కల్వకుర్తి మీదుగా మహబూబ్‌నగర్‌కు చేరుకున్న జూపల్లి
- 'హస్తం' కార్యాలయం వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌ను సైతం..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగంగా కాంగ్రెస్ శనివారం చేపట్టిన రిజర్వాయర్ల సందర్శన ఉత్కంఠకు దారితీసింది. శనివారం రాత్రే సమాచారం అందుకున్న పోలీసులు కొల్లాపూర్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీకి చెందిన వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి సందర్శనకు శ్రీకారం చుట్టిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ నుంచి అక్కడకు వెళ్లకుండా.. కల్వకుర్తి మీదుగా మహబూబ్‌నగర్‌కు చేరుకున్నారు. షాద్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు వీర్లపల్లి శంకర్, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డితో కలిసి నేరుగా కాంగ్రెస్ కార్యాలయంలోకి ఉదయం 8 గంటలకు వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకోగా.. హడావుడి చోటుచేసుకుంది. లోపల విలేకరుల సమావేశంలో మాట్లాడిన అనంతరం మధ్యాహ్నం 12.35 గంటలకు **జూపల్లి తదితరులు బయటకు రాగా.. పోలీసులు అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. తమను ఎందుకు అరెస్ట్** చేస్తున్నారు.. ఏమైనా ధర్నా చేస్తున్నామా అని జూపల్లి, నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కాసేపు ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. జూపల్లి, ఇతర నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి వాహనంలోకి తీసుకెళుతుండగా.. కార్యకర్తలు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జూపల్లి, ఇతర నాయకులను పోలీసులు మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా.. అదే దారిలో వస్తున్న నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి తదితరులు అక్కడే రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు వారిని సైతం అరెస్ట్ చేసి మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు, జూపల్లి తదితరులను మహమ్మదాబాద్ పీఎస్‌కు తరలించారు. ఇలా సుమారు మధ్యాహ్నం ఒంటిగంట వరకు నాటకీయ పరిణామాలు చోటుచేసుకోగా.. ఉత్కంఠ నెలకొంది.

సంజీవ్ ముదిరాజ్, కొత్వాల్ అరెస్ట్

జూపల్లి కృష్ణారావును కలవడానికి కాంగ్రెస్ కార్యాలయానికి వస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, బెక్కరి మధుసూదన్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా పట్టణంలో నాయకులు సిరాజ్‌ఖాద్రీ, రాములు యాదవ్, సాయిబాబా, తాహెర్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరందరినీ సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఓట్ల కోసమే హడావుడిగా ప్రారంభిస్తున్నారు: జూపల్లి

స్టేషన్ మహబూబ్‌నగర్: 'పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ కాల్వలకు సంబంధించి భూసేకరణ పూర్తికాలేదు.. టెండర్లు పిలవనే లేదు.. మరి ఏ విధంగా ప్రాజెక్ట్ పూర్తయింది.' అని జూపల్లి ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిందని కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పడం పూర్తి అవాస్తవమన్నారు. రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసమే పూర్తికాని ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నారని విమర్శించారు. శనివారం మహబూబ్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నార్లాపూర్ రిజర్వాయర్ రెండో లిఫ్ట్ ద్వారా నుంచి ఏదుల వరకు కెనాల్ ద్వారా నీళ్ల పంపాలని.. ఈ కెనాళ్లు పూర్తికానప్పుడు ఏ విధంగా నీళ్లు తీసుకుపోతారని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తయినప్పుడు ప్రతిపక్ష నాయకులకు ఎందుకు చూపించరు.. ప్రాజెక్ట్‌లో అవినీతి జరగనప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ పూర్తయినట్లు గూగుల్ మ్యాప్‌లోనే మీ పనితనం చూపిస్తున్నారని.. హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ, సోనియాగాంధీ సభల ప్రాధాన్యతను తగ్గించేందుకే ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నారని విమర్శించారు.

■ ప్రభుత్వ లెక్కల ప్రకారం కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.5,570 కోట్లలో ఇంకా రూ.500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. 1,44,450 ఎకరాల ఆయకట్టుకు ఇప్పటికీ నీళ్లు రాలేదన్నారు. తొమ్మిదేళ్లవుతున్నా.. కల్వకుర్తి ప్రాజెక్ట్ ఇంకా పూర్తికాలేదన్నారు. కల్వకుర్తి ప్రాజెక్ట్ లెక్కను బట్టి పాలమూరు–రంగారెడ్డి పూర్తిచేయడానికి 20 ఏళ్లు పడుతుందన్నారు.



జూపల్లి కృష్ణారావును తీసుకెళ్తున్న పోలీసు వాహనానికి అడ్డుపడుతున్న కార్యకర్తలు

ముందస్తు అదుపులోకి..

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ముందస్తుగా 35 మంది కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ పరిధిలో 10 మంది, టూటౌన్‌లో 20, రూరల్ పరిధిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల సమీపంలో ఉన్న మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 18, బైపీసీలో 8, సీఈసీలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని.. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. హాస్టల్ సీట్లు పూర్తయినందున బాలికలు హాస్టల్‌లో ఉండే అవకాశం లేదన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

కొత్తకోట రూరల్: పెద్దమందడిలోని మెడికల్ దుకాణాలు, ప్రథమ చికిత్సా కేంద్రాలను శనివారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రష్మీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్న ఆర్‌ఎంపీ హౌస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఆర్‌ఎంపీలు మందులు విక్రయించినా, స్థాయికి మించి వైద్యం చేసినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

తిరుమలయ్య గుట్టకు పోటెత్తిన భక్తులు

పెబ్బేరు రూరల్: శ్రావణమాసం చివరి శనివారం కావడంతో వనపర్తి మండలం పెద్దగూడెం శివారు తిరుమలయ్యగుట్టకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కొండపై వెలిసిన తిరుమలనాథ వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు కురుమూర్తి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏఎస్పీ రామదాస్ తేజావత్, బీఆర్‌ఎస్ నాయకుడు వంగూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నాగన్న స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్‌ఐ నాగన్న ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



తెలంగాణ వైతాళికుడు కాళోజీ

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



కాళోజీ చిత్రపటానికి నమస్కరిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు కాళోజీ రచనలు పండితుల నుంచి సామాన్యుల వరకు అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఉంటాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కాళోజి 109వ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఎంవైఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి రచించిన 'వెలుగు సంతకం' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి రచించిన ప్రతి కవిత హృదయాన్ని అతుక్కునేలా ఉంటాయని కొనియాడారు. కార్యక్రమానికి హాజరైన కాకతీయ యూనివర్సిటీ డీన్ ఆచార్య బన్న ఐలయ్య మాట్లాడుతూ.. ఈ కవిత సంపుటి మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని, ఆయన చేసిన అభివృద్ధిని స్పష్టంగా తెలియజేస్తున్నాయన్నారు. డా. సీతారాం, డా. ఎస్. రఘు మాట్లాడుతూ.. పుస్తకంలోని కవితలు నిరంజన్‌రెడ్డిని ప్రజానాయకుడిగా స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ బి.లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ నాగన్న, స్థానికులు బలరాం, వనపట్ల సుబ్బయ్య, శంకర్‌గౌడ్, రూపాదేవి, స్వరాజ్యం, బైరోజు చంద్రశేఖర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

2,492 కేసులు పరిష్కారం



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

వనపర్తిటౌన్: రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్‌కోర్టు న్యాయమూర్తి వి.రజిని అధ్యక్షతన శనివారం జిల్లాకేంద్రంలోని కోర్టు సముదాయంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా కక్షిదారులు రాజీపడితే న్యాయస్థానం ఇద్దరికి న్యాయం చేస్తుందని, పోలీస్‌స్టేషన్లు, కోర్టులు న్యాయానికి పెద్దపీట వేస్తున్నాయని వివరించారు. రాజీమార్గంతో ప్రశాంత జీవితం పొందవచ్చని తెలిపారు. లోక్‌అదాలత్‌లో 39 సివిల్, 2,392 క్రిమినల్, 61 ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్‌యాదవ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి బి.రవికుమార్, రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి వై.జానకి, న్యాయవాదులు పుష్పలత, శోభారాణి, జయలక్ష్మి, డి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

మదనాపురం: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి డా. రవిశంకర్ ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. రోజువారీగా ఆస్పత్రిలో నమోదవుతున్న ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గర్భిణులు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానంగా వలస వెళ్లిన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతినెల 9వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. సాధారణ ప్రసవం అయిన మహిళకు కేసీఆర్ కిట్ అందజేశారు. వైద్యాధికారి డా. భవాని, సూపర్‌వైజర్ ప్రమీల, సిబ్బంది నర్మద, శిల్ప, సరిత పాల్గొన్నారు.




కేసీఆర్ కిట్ అందజేస్తున్న డా. రవిశంకర్

వన్యప్రాణులకు నల్లమల సేఫ్

- పులుల సంరక్షణపై నిరంతర పర్యవేక్షణ
- బేస్ క్యాంప్‌లలో పెరిగిన సిబ్బందితో ప్రత్యేక నిఘా
- అటవీ సరిహద్దులో కంచె ఏర్పాటుకు కృషి
- ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధునాతన ఆయుధాలు?
- 'అడవిని కాపాడండి.. విస్తరించండి' నినాదంతో కార్యక్రమాలు

నల్లమల అభయారణ్యం విస్తీర్ణం	2,611.39 చ.కి.మీ..
పులుల అభయారణ్యం	2,166.37 చ.కి.మీ..
బఫర్ జోన్	445.02 చ.కి.మీ..
పులులు	30
చిరుతలు	100
ఎలుగుబంట్లు	150 - 200
పక్షుల రకాలు	60



నల్లమల అభయారణ్యం భద్రతపై అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఒకవైపు వన్యప్రాణులు, మరోవైపు విలువైన అటవీ సంపదను వేటగాళ్ల బారి నుంచి కాపాడేందుకు పటిష్టమైన రక్షణ వ్యవస్థ రూపొందిస్తోంది. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు సురక్షితులైన సిబ్బందిని సిద్ధం చేస్తోంది. ఇందుకు కొందరు అధికారులు, సిబ్బందికి అధునాతన ఆయుధాలు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దేశంలో రెండో అతిపెద్ద టైగర్ రిజర్వుగా విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకునేందుకు అడుగులు వేస్తోంది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2,611.39 చదరపు కి.మీ. విస్తీర్ణంలో నాగర్‌కర్నూల్, నాగార్జునసాగర్ వరకు విస్తరించి ఉంది. ఇందులో 2,166.37 చదరపు కి.మీ., అభయారణ్యం కాగా.. 445.02 చదరపు కి.మీ., బఫర్ జోన్‌గా ఉంది. నల్లమలలో పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, ఇతర వన్యప్రాణులు వేల సంఖ్యలో ఉన్నాయి.

– సాక్షి, మహబూబ్‌నగర్ డెస్క్

సండే స్పెషల్

ఏటీఆర్ పరిధిలో..

అమ్రాబాద్ టైగర్ రిజర్వులో అటవీశాఖ సిబ్బంది సంఖ్య భారీగా పెరిగింది. ఏటీఆర్ పరిధిలో అచ్చంపేట, అమ్రాబాద్, నాగార్జునసాగర్ సబ్ డివిజన్‌లతో పాటు అచ్చంపేటలో ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజన్ ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో 385 సిబ్బందికి 201 మంది పనిచేస్తుండగా.. 184 ఖాళీలు ఉన్నాయి. జిల్లా పరిధిలో 8 రేంజ్‌ల పరిధిలో 27, నాగార్జునసాగర్ పరిధిలో 3 బేస్ క్యాంపులు ఉండగా.. ఒక్కో క్యాంపులో ఐదుగురు సిబ్బంది ఉన్నారు. జిల్లా పరిధిలో పులుల సంఖ్య పెరగడంతో తాజాగా 120 మంది బీట్ ఆఫీసర్లను పెంచడంతో వారి సంఖ్య 255కి పెరిగింది. వీరితో పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో 135 మంది వాచర్స్, 25 మంది ప్రొటెక్షన్ ట్రాకర్స్ పనిచేస్తున్నారు. అక్రమ రవాణా అరికట్టి, వాహనాల రాకపోకలపై నిరంతరం నిఘా ఉంచేందుకు నాలుగు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. అచ్చంపేట– మన్ననూర్, దోమలపెంట– శ్రీశైలం, రంగాపూర్– ఉమామహేశ్వరం, మద్దిమడుగు ప్రాంతాల్లో ఉన్న చెక్‌పోస్టులలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుంటారు.






నిఘా నీడలో..

నల్లమల అటవీ ప్రాంతం, కృష్ణాతీర ప్రాంతాలు ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన పర్యాటకానికి చిరునామాగా మారాయి. ఇంతటి ప్రాముఖ్యత గల అటవీ సంపదను కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అడవిని కాపాడండి.. అడవిని విస్తరించండి అనే నినాదంతో కార్యక్రమాలు చేపడుతున్నారు. అడవి రక్షణతో పాటు పులుల సంరక్షణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఎలక్ట్రానిక్–ఐ (ఈ–కన్ను) నిఘా వ్యవస్థ సత్ఫలితాలు ఇస్తోంది. ఆటోమేటిక్ సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ, బేస్ క్యాంపులు, చెక్‌పోస్టుల ఏర్పాటుతో నిఘా పటిష్టం చేసింది. జీపీఎస్ మొబైల్ అనుసంధానం యాప్ ద్వారా మానిటరింగ్ చేస్తోంది. సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా పనిచేసే ఈ విధానంతో వివిధ సెన్సిటివ్ జోన్లలో హైరెజుల్యూషన్ థర్మల్, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల ద్వారా పులులు, మనుషుల కదలికలను రికార్డు చేస్తోంది. ఉన్నతాధికారుల సెల్‌ఫోన్‌కు జంతువుల కదలిక, ఇతర ఘటనలకు సంబంధించి అలర్ట్‌లు, నోటిఫికేషన్లు వచ్చే సాంకేతికతను ఏర్పాటు చేశారు.

ఉద్యోగ భద్రత కల్పిస్తే..

అటవీశాఖలో సిబ్బంది పోస్టుల్లో రిక్రూట్‌మెంట్ పాలసీ మారితే తప్ప కొన్ని పోస్టుల్లో భర్తీ అయ్యే అవకాశం కనిపించడం లేదు. టీఎస్‌పీఎస్సీ ద్వారా 2017లో బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించగా.. 2018– 2020 మధ్యలో కొన్ని పోస్టులు భర్తీ చేశారు. ఏజెన్సీ ఏరియా కావడంతో ఎస్టీలతోనే ఈ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండడం, వారు లేని కారణంగా ఇతరులకు అవకాశం లేకపోవడంతో కొన్ని పోస్టులు భర్తీ కాలేదు. కొంతమంది ఉద్యోగంలో చేరకపోవడం, ఇతర డిపార్ట్‌మెంట్‌లోకి వెళ్లడం, 15 మంది బీట్ ఆఫీసర్లు, 3 సెక్షన్ ఆఫీసర్లు ఉద్యోగం వదిలి వెళ్లారు. 20 ఏళ్ల నుంచి వాచర్లుగా పనిచేస్తున్న చెంచులను తమిళనాడు తరహాలో ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రూ.12,500కే పనిచేస్తున్న వాచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే పదోన్నతులపై అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అడవిపై పట్టు ఉన్న చెంచులు, ఈ ప్రాంతవాసులతో భర్తీ చేస్తే అటవీ సంరక్షణ మరింత ప్రతిష్ఠం అవుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.



నల్లమల అటవీ ప్రాంతం


పులుల సంతతి పెంచడమే..

అచ్చంపేట సబ్‌డివిజన్ పరిధిలో అచ్చంపేట, నాగర్‌కర్నూల్, లింగాల, కొల్లాపూర్, అమ్రాబాద్ సబ్ డివిజన్ పరిధిలో అమ్రాబాద్, మద్దిమడుగు, మన్ననూర్, దోమలపెంట, నాగార్జునసాగర్ సబ్ డివిజన్ పరిధిలో నాగార్జునసాగర్, దేవకొండ, కమాలపల్లి రేంజ్‌లో ఉన్నాయి. గతేడాది నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసీఏ) చేపట్టిన అధికార లెక్కల ప్రకారం అమ్రాబాద్‌లో 21 పెద్దపులులు ఉన్నాయి. తర్వాత వీటి సంతతి మరింత పెరిగినట్లు అటవీశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఏప్రిల్‌లో నాలుగు పులులు జన్మనివ్వగా మరిన్ని పులి పిల్లలు, ఎఫ్7 అనే పెద్దపులి మరో మూడు పులి పిల్లలకు జన్మనివ్వడంతో వీటి సంఖ్య 30కి పెరిగినట్లు భావిస్తున్నారు. వచ్చే ఏడాదికి పెద్ద పులుల సంఖ్య మరింత పెంచాలన్న లక్ష్యంతో అధికారులు అడుగులు వేస్తూ పూర్తి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. వన్యప్రాణులు గ్రామాలు, అడవి దాటకుండా అటవీ సరిహద్దులో కంచె ఏర్పాటు చేస్తున్నారు.

బేస్ క్యాంపులు పెరిగితే..

దేశంలో అతిపెద్ద టైగర్ రిజర్వు ఏటీఆర్‌లో బేస్ క్యాంపులు, సిబ్బంది సంఖ్య ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. కర్ణాటకలో ఒక్కో టైగర్ రిజర్వులో 200, ఒక్క పులి లేని ఖమ్మంలో 50 బేస్ క్యాంపులు ఉంటే.. 30 పులులు ఉన్న ఏటీఆర్‌లో 30 మాత్రమే ఉన్నాయి. అటవీ నిబంధనల ప్రకారం 10 చ.కి.మీ., ఒక బేస్ క్యాంపు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం వంద చ.కి.మీ., ఒకటి ఉంది. బేస్ క్యాంపుల సంఖ్య పెంచడం వల్ల లోతట్టు ప్రాంతంలో నివశిస్తున్న చెంచులకు ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా జీవనోపాధి లభిస్తోందని, అప్పుడు వారే అడవిని వదిలి బయటికి వస్తారని, ఆర్థికంగా మెరుగుపడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ప్రశాంత వాతావరణంలో..



నల్లమల అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది సంఖ్యను పెంచుతూ అటవీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నాం. పులులు నదిని దాటేందుకు ఆటంకం కావడంతో చేపల వేటను నిషేధించాం. కావాల్సిన ప్రశాంతత లభిస్తున్నందున పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. బీట్ ఆఫీసర్ పోస్టుల్లో ఉండేందుకు ఇష్టపడని విషయం నిజమే. పీజీ, బీటెక్ చేసిన వారు ఈ ఉద్యోగం వదిలి ఇతర శాఖల్లోకి వెళ్తున్నారు. వాచర్లకు ఉద్యోగ భద్రత కల్పించే విషయం ప్రభుత్వం చేతిలో ఉంది. వారికి ఇవ్వడం వల్ల అడవి మరింత ప్రతిష్టమవుతోంది.

– రోహిత్ గోపిడి,
జిల్లా అటవీశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

యువకుడి దుర్మరణం


మోహన్ (ఫైల్)

మానవపాడు: స్నేహితులతో కలిసి శుభకార్యానికి వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ రాము కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన మోహన్ (18) మానవపాడులో పెళ్లికి శుక్రవారం వచ్చాడు. వ్యక్తిగత పని నిమిత్తం తెలిసిన వారి ద్విచక్ర వాహనం తీసుకొని అదేరోజు రాత్రి 44వ నంబర్ జాతీయ రహదారి వైపు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి జూరాల కాల్వలో పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం ఉదయం వెదకగా కాల్వలో మృతదేహం, బైక్ కనిపించింది. మోహన్ కర్నూలులోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతదేహానికి అలంపూర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

దైవదర్శనానికి వెళ్తూ మహిళ..


మాగనూర్: దైవదర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన ఘటన శనివారం ఉదయం మండల కేంద్రంలోని బస్టాడ్ చౌరస్తాలో చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లేష్ కథనం మేరకు.. శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా కర్ణాటకలోని రాయచూర్ మడ్డిపేటకు చెందిన కుర్వ శ్రీశైలం భార్య లలిత (35), ఇద్దరు కుమార్తెలతో కలిసి మక్తల్‌లోని పడమటి ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లలిత తలపై నుంచి లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందగా.. పెద్ద కుమార్తె ఝాన్సీ, కుర్వ శ్రీశైలంకు స్వల్ప గాయాలయ్యాయి. లారీడ్రైవర్ లక్ష్మప్పపై కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లలితకు నలుగురు సంతానం కాగా అందరూ ఆడపిల్లలే.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం


రామస్వామి(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో వ్యవసాయ పొలంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని పెద్దాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దాపూర్‌కి చెందిన రామస్వామి(50) కుటుంబంలో కొద్ది రోజులుగా కలహాలు చోటుచేసుకున్నాయి. శనివారం మరోమారు భార్యాభర్తలు గొడవ పడ్డారు. క్షణికావేశానికి గురైన రామస్వామి వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రైలులో నుంచి పడి వ్యక్తి మృతి



రాజాపూర్: రైలులో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని రంగారెడ్డిగూడ శివారులో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డిగూడ రైల్వేగేట్ ఎల్‌సీ నెంబర్ 39 సమీపంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారంతో మృతుడు శరీరంపై శాహిల్ అనే పచ్చబొట్టు ఉందని, మృతుడు బీహార్‌వాసి అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా సమాచారం తెలిస్తే రైల్వే ఎస్ఐ అక్బర్ 9848402339 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి మరొకరు..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కింద పడటంతో గాయాలై వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని శ్రీపురంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీపురానికి చెందిన కుర్మయ్య(45) శనివారం ఉదయం ఇంటి నుంచి కిరాణానికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు కింద పడటంతో గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

కనులపండువగా ఆరుద్రోత్సవం


గోపూజలో ఆలయ ఈఓ పురేందర్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: శ్రావణ శనివారం ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో అలంపూర్ ఆలయాల్లో ఆరుద్రోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గోపూజ, ఆలయ ప్రాకార ప్రదక్షిణలు, గణపతి పూజ, మహాన్యాస పారాయణం జరిపించారు. అలాగే గర్భాలయంలోని బాలబ్రహ్మేశ్వరుడికి నమక చమకాలతో ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం చేశారు. అన్నసూక్త పఠనంతో స్వామివారికి అన్నాభిషేకం చేసి లింగాకృతిలో అలంకరించి మహా నివేదన సమర్పించారు. దశవిధ హారుతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. శ్రావణ శనివారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాతకు స్వాగతం పలుకుతున్న అధికారులు


లింగాకృతిలో బాలబ్రహ్మేశ్వరస్వామి

ఆలయాలను దర్శించుకున్న న్యాయమూర్తులు..

అలంపూర్ ఆలయాలను శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత, గద్వాల జిల్లా సీనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, పాలకమండలి సభ్యులు వెంకటనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, నీలప్ప ఆలయ అర్చకులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలి కారు. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఏకవార రుద్రాభిషేకం, జోగుళాంబ ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఎస్ఐ రమేష్, స్థానిక కోర్టు జూనియర్ అసిస్టెంట్ చిన్నరాజు పాల్గొన్నారు.

గద్వాల ఎమ్మెల్యే దంపతులు..

శ్రావణ శనివారం పురస్కరించుకొని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కుటుంబ సమేతంగా అలంపూర్ ఆలయాలను దర్శించుకోగా అర్చకులు స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ చైర్మన్, ఈఓ ఎమ్మెల్యే దంపతులకు శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

మన్యంకొండలో భక్తజనసంద్రం


మన్యంకొండలో బారులు తీరిన భక్తులు

- దానంగాలతో నైవేద్యాలు
- కొనసాగుతున్న 'శాంతిహోమం'


అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం శనివారం భక్తజన సందోహంతో పోటెత్తిపోయింది. శ్రావణ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే భక్తులు దర్శనానికి బారులు తీరారు. దిగువకొండ వద్దనున్న అలివేలు మంగతాయారు ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన చేపట్టారు.

కొనసాగుతున్న హోమం

మన్యంకొండ దేవస్థానంలో హోమ కార్యక్రమం కొనసాగుతుంది. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని దేవస్థానంలో ప్రతిరోజు హోమంతో పాటు పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన క్షేత్రపాలకుడైన శ్రీవీరభద్రస్వామి అఖండదీపారాధన పూజా కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహిస్తున్నారు. చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

మామిడి క్లస్టర్ అభివృద్ధికి రూ.172కోట్లు


సదస్సులో మాట్లాడుతున్న మధుసూదన్

కొల్లాపూర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మామిడి క్లస్టర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.172కోట్లు కేటాయించినట్లు కేంద్ర ప్రతినిధుల బృందం వెల్లడించింది. మామిడి క్లస్టర్ అభివృద్ధిపై శనివారం కొల్లాపూర్‌లోని రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు శర్మ, ప్రవీణ్, రాజు, జితేందర్, భూపేష్, రాష్ట్ర ప్రతినిధి డీడీహెచ్ మధుసూదన్ మాట్లాడుతూ మామిడి ఎగుమతులు పెంచడంతో పాటు, బ్రాండ్ విలువను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్లస్టర్ అభివృద్ధిలో భాగంగా ఆధునిక పద్ధతిలో తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. నాణ్యమైన మొక్కల పెంపకం, అధిక సాంద్రతతో మామిడి ఉత్పత్తి వంటి అంశాలను రైతులకు వివరించారు.

దూడపై చిరుత దాడి



మరికల్: కోడెదూడపై చిరుత దాడికి పాల్పడిన ఘటన మరికల్ మండలం మాధవరం గ్రామశివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మాధవరం గ్రామానికి చెందిన వెంకటయ్య తన పశువులను వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో కోడెదూడపై చిరుత దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. చిరుత బారి నుంచి పశువులను కాపాడాలని రైతులు కోరారు.

మార్కెట్‌లోకి రెనాల్ట్ ట్రైబర్ అర్బన్ నైట్

పాలమూరు: రెనాల్ట్ కంపెనీ నుంచి కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన ట్రైబర్ అర్బన్ నైట్ కారును శనివారం జిల్లా కేంద్రంలోని యక్త మోటార్స్ షోరూంలో డైరెక్టర్ గట్టు శ్రీహర్షిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైబర్ అర్బన్‌నైట్ లిమిటెడ్ ఎడిషన్ అందుబాటులోకి తీసుకొచ్చామని, ఈ కారు 4 స్టార్ భద్రత విభాగంలో స్థానం సంపాదించిందన్నారు. దీంట్లో స్మార్ట్ మిర్రర్ మానిటర్, అత్యాధునికమైన హెడ్ లైట్స్, డోర్ ల్యాంప్స్, ఎత్తయిన కొండ ప్రాంతాలలో ప్రయాణించే సమయంలో డ్రైవర్లకు సహాయపడే విధంగా ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం ద్వారా ట్రాక్షన్ కంట్రోల్ సిస్టం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కారు ఎక్స్‌షోరూం ధర రూ.8,41,499అందుబాటులో ఉందని, పెట్రోల్ వెర్షన్‌లో 20కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందన్నారు. దీని సామర్థ్యం ఏడు సీట్లు కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ గిరీష్, సర్వీస్ మేనేజర్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.



కారు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ శ్రీహర్షిత్‌రెడ్డి

రేషన్‌బియ్యం పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ బాల్‌రాజు శనివారం తెలిపారు. కర్నూల్ జిల్లా డోన్ నుంచి అనుమతి లేకుండా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గద్వాల్‌కు వాహనంలో తరలిస్తుండగా, శుక్రవారం అర్ధరాత్రి పట్టుకుని శనివారం కేసు నమోదు చేసి విజిలెన్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. డ్రైవర్ గద్వాల్‌కు చెందిన ఎరకలి విజయ్‌గా గుర్తించినట్లు తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

అచ్చంపేట రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న ఆమె ఈనెల 2 నుంచి కన్పించకుండా పోయింది. ఆమె ఫోన్ పనిచేయకపోవడం, ఆచూకీ లభించకపోవడంతో శనివారం సిద్దాపూర్ పోలీస్ స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు.

ఉత్సాహంగా ఎండీసీఏ లీగ్


ఆరెంజ్ జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా

- హోరాహోరీగా తలపడుతున్న జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో ఎండీసీఏ లీగ్ ఉత్సాహంగా జరుగుతోంది. ప్రతి శని, ఆదివారాలు ఎండీసీఏ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో పింక్ జట్టు 25 పరుగుల తేడాతో గ్రీన్ జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పింక్ జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. జట్టులో ఆయూష్ రాజ్ 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. గ్రీన్ జట్టు బౌలర్లు అశోక్, కార్తీక్, మనోజ్ రెండేసీ వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గ్రీన్ జట్టు 20.4 ఓవర్లలో 103 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో గణేష్ 31 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పింక్ బౌలర్లు సుమిత్ 3, అరుణ్ 2 వికెట్లు తీశారు. మరో లీగ్ మ్యాచ్‌లో ఆరెంజ్ జట్టు 15 పరుగుల తేడాతో బ్రౌన్ జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆరెంజ్ జట్టు 25 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. జట్టులో సాయికేథన్ 74 బంతుల్లో 6 ఫోర్లతో 80 పరుగులు చేసి రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బ్రౌన్ జట్టు 24 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అంకిత్‌రాయ్ 45, హర్షిత్ 38 పరుగులు చేశారు. యశ్వంత్ 3, సాయికేథన్, అంకిత్ రెండేసి వికెట్లు తీశారు.


సాయికేథన్ (80 పరుగులు)

లీగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లీగ్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని ప్రతిభ చాటాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. గెలుపొందిన క్రీడా జట్లను ఆయన అభినందించారు. లీగ్‌తో నైపుణ్యం ఉన్న గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం లీగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

పురాతన ఆలయంలో శిలాశాసనం గుర్తింపు


ఈరట్వానిపల్లి సమీపంలో శిథిలావస్థలో ఉన్న పురాతన ఆలయం


ఆలయం వద్ద గుర్తించిన శిలాశాసనం

ఉప్పునుంతల: మండలంలోని ఈరట్వానిపల్లి సమీపంలో ఉన్న పురాతన ఆలయంలో శనివారం శిలా శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. ఈ శాసనం కందూరిచోట పాలకులలో ఉదయనచోడ మహారాజు కాలం నాటిదని బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్, సభ్యుడు గోరటి భాస్కర్ తెలిపారు. క్రీ.శ. 1156 ఏప్రిల్ 19న గురువారం యంచేడలి మల్లికార్జున స్వామి నైవేద్యానికి మేర్వే నాయకుడు చేసిన దానంగా శాసనాన్ని వారు గుర్తించారు. స్తంభం అంచు ఒక మూల విరిగిపోవడంవల్ల శాసనం కొంత దెబ్బతిన్నట్లు తెలిపారు. ఈ శాసనం తెలుగు లిపిలో, తెలుగు భాషలో 9 పంక్తులలో ఉందని పేర్కొన్నారు.

'బీసీలు రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలి'


పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు

'రెడ్లు, వెలమలేనా! బీసీలు సీఎం కావొద్దా? పుస్తకావిష్కరణ

కందనూలు: బీసీలు రాజకీయ రంగంలో నిలదొక్కుకొని రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలని వెన్నచర్ల సుబ్బయ్య అన్నారు. ప్రముఖ తెలంగాణ సాహిత్య విమర్శకులు, పరిశోధకుడు, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన 'రెడ్లు, వెలమలేనా! బీసీలు సీఎం కావొద్దా? అనే పుస్తకాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని కో–ఆపరేటివ్ ఆఫీస్ సొసైటీ సమావేశ మందిరంలో బహుజన మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి వెన్నచర్ల సుబ్బయ్య అధ్యక్షత వహించగా.. ప్రొఫెసర్ పెబ్బేటి మల్లికార్జున్ పుస్తక ఆవిష్కరణ చేశారు. పుస్తక సమీక్షను సి.భాస్కర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీలు దశాబ్దాలుగా తమ హక్కుల కోసం పోరాడాల్సి రావడం దారుణమన్నారు. 'ఓట్లు, మనవి సీట్లు మన'కు నినాదంతో ముందుకు సాగితేనే న్యాయం జరుగుతుందన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్య్ర దేశంలో బీసీలు అన్ని రంగాల్లో అణిచివేయబడ్డారని సి.భాస్కర్ అన్నారు. ఏడు శాతం ఉన్న, ఉన్నత కులాలకు ఏడు పార్టీలు ఉండగా.. 56శాతం ఉన్న బీసీలకు ఒక్క పార్టీ లేకపోవడం శోచనీయమన్నారు. పుస్తక రచయిత డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ... బీసీల ఐక్యత ద్వారానే రాజ్యాధికారం సాధ్యం అన్నారు. అన్ని సమస్యలు రాజ్యాధికారంతో మాత్రమే పరిష్కారం అవుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవి గుడిపల్లి నిరంజన్, బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు అరవింద చారి, ఆంజనేయులు, వెంకటేశ్వర రావు, మోహన్ రామకృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : నలుగురికి గాయాలు


ఘటన స్థలంలో క్షతగాత్రులు

కోస్గి: ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొని నలుగురు గాయాలపాలైన ఘటన గుండుమాల్ మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. గుండుమాల్‌కు చెందిన రంగయ్య తన బైక్‌పై గండేడ్ మండలం గోవిందుపల్లిలో జరిగే గట్టు చెన్నకేశవస్వామి ఉత్సవాలకు బయలుదేరారు. కోత్లాబాద్‌కు చెందిన శ్రీశైలం, అంజిలయ్య, శ్రీను ముగ్గురు కలిసి ఒకే బైక్‌పై అదే జాతరకు వెళ్తున్నారు. గుండుమాల్ మండలంలోని ముదిరెడ్డిపల్లితండా సమీపంలో రోడ్డు మలుపు దగ్గర ఎదురెదురుగా వచ్చి రెండు బైక్‌లు బలంగా ఢీకొనడంతో అంజిలయ్య, శ్రీశైలం తలలకు గాయాలు కాగా రంగయ్య కాలు విరిగింది. మరో వ్యక్తికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న కొందరు 108కి సమాచారం ఇచ్చి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు విద్యార్థులకు..

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ జెడ్పీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న నరేష్, నారాయణపేట కాకతీయ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న వెంకటేష్‌లు శనివారం గ్రామ సమీపంలోని కనకాద్రి జాతరకు బైక్‌పై వెళ్తుండగా క్రషర్ మిషన్ చౌరస్తాలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరు విద్యార్థులను జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వీరిలో ఒకరి తలకు తీవ్ర గాయం కావడంతో మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు.

వాహనం ఢీకొని పునుగుపిల్లి మృతి



పెద్దకొత్తపల్లి: యాపట్ల, అంబడిపల్లి బీటీ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పునుగుపిల్లి మృతి చెందింది. రోడ్డుపై వెళ్తున్న గ్రామస్తులు గమనించారు. అటవీ సమీపంలో వాహనాలు నడిపేవారు అడవి జంతువులను ఢీకొట్టకుండా జాగ్రత్తగా నడపాలని గ్రామస్తులు కోరారు.



రూ. 6 లక్షల కోట్లు

- ఏలేరు నుంచి స్కిల్ స్కాం వరకు ప్రజాధనం దోపిడీ
- రాజకీయ అరంగేట్రం నుంచే 'మేత'కు మరిగిన నేత
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటుతో దొడ్డిదారిన అధికారంలోకి
- ఏలేరు స్కాంతో దేశంలో సంచలనం సృష్టించిన బాబు
- 1995-2004 మధ్య ప్రజాధనం దోపిడీలో విశ్వరూపం
- కుంభకోణాల బాబును 2004లో ఇంటికి పంపిన జనం
- విభజన నేపథ్యంలో హామీలు ఎర వేసి మోసం
- అధికారంలోకి వచ్చాక నిజ స్వరూపాన్ని చాటిన వైనం
- 'స్కాం'ల కోసమే స్కీంలు ప్రవేశ పెట్టిన ఘనత

దోపిడీకి రాచబాట

- అధికారులను బెదిరించి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు
- చంద్రబాబుతో పాటు నారాయణ, లోకేశ్‌లదీ కీలక 'భూ'మిక
- లింగమనేనితో క్విడ్ ప్రో కో
- రోడ్డు అలైన్‌మెంట్‌లో అవినీతి మెలికలు
- ప్రతిగా కరకట్ట నివాసం, లింగమనేని నుంచి భూములు
- రూ. 2 వేల కోట్ల భూ దోపిడీకి బాబు స్కెచ్

సూత్రధారి, లబ్ధిదారుడు అంతా అతడే

- బలమైన సాక్ష్యాధారాలతోనే చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసింది: సజ్జల
- ఇందులో రాజకీయ దురుద్దేశాలు, కక్ష సాధింపులు లేవు
- దేశ చరిత్రలో అత్యంత దారుణమైన ఆర్థిక నేరం స్కిల్ స్కామ్
- 2017–18లోనే ఈ కుంభకోణాన్ని బహిర్గతం చేసిన జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం
- చంద్రబాబు ఆదేశాలతోనే నిధులిచ్చామని ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు కోర్టులో చెప్పారు
- స్కిల్ డెవలప్‌మెంట్, డిజైన్ టెక్, గత ప్రభుత్వంతో తమకు సంబంధం లేదన్న సీమెన్స్
- నిన్నటి వరకూ బాబు గొంతెత్తి అరుస్తూ తిరుగుతున్నారు కదా?
- అరెస్టు చేయగానే హఠాత్తుగా బీపీనా?.. చౌకబారు రాజకీయాలొద్దు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ ముసుగులో ప్రభుత్వ ఖజానా నుంచి డిజైన్ టెక్, ఇతర షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్ల దోపిడీలో ప్రధాన సూత్రధారి, పాత్రధారి, లబ్ధిదారుడు మాజీ సీఎం చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు ఆర్థిక నేరానికి పాల్పడ్డారని బలమైన సాక్ష్యాధారాలు ఉన్నందు వల్లే సీఐడీ సిట్ విభాగం శనివారం ఉదయం 6 గంటలకు ఆయన్ను అరెస్టు చేసిందని తెలిపారు. నేరానికి సంబంధించి ఒక వ్యక్తి పాత్రపై కచ్చితమైన ఆధారాలు ఉన్నప్పుడు దర్యాప్తు సంస్థలు విచారణలో భాగంగా వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం సాధారణమేనన్నారు. ఈ కేసులో అసలు విషయాన్ని మరుగున పరుస్తూ రాజకీయంగా కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు చేశారంటూ చంద్రబాబుతోపాటు టీడీపీ నేతలు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పూర్తి నిగ్రహం, సంయమనం పాటిస్తూ ఎలాంటి దురుద్దేశాలు లేకుండా బలమైన సాక్ష్యాధారాలు లభించిన తరువాతే చంద్రబాబును సిట్ అరెస్టు చేసిందని స్పష్టం చేశారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు.



దేశ చరిత్రలో తీవ్ర ఆర్థిక నేరమిదే..

2017–18లో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో డిజైన్ టెక్‌కు చేసిన చెల్లింపులపై జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం దర్యాప్తు చేసింది. ఇందులో రూ.240 కోట్లు షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లినట్లు తేల్చింది. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని 2018లో విజిల్ బ్లోయర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై ఏసీబీ విచారణను అప్పటి సీఎం చంద్రబాబు తొక్కి పట్టి నోట్ ఫైల్స్‌ను మాయం చేశారు. ఆధారాలను ధ్వంసం చేయడం ద్వారా తన అక్రమాలను అప్పట్లోనే ఆయన అంగీకరించారు. ఏసీబీ దర్యాప్తును చంద్రబాబు తొక్కిపెడితే.. 2021 డిసెంబర్ 9న సీఐడీ సిట్ విభాగం విచారణ ప్రారంభించింది. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నలుగురిని అరెస్టు చేసి డిజైన్ టెక్‌కు చెందిన రూ.31 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. తాము వద్దని వారించినా డిజైన్ టెక్‌కు నిధులు విడుదల చేయాలని అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశించడం వల్లే నిధులు విడుదల చేశామని సెక్షన్ 164 కింద న్యాయస్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు సాక్ష్యమిచ్చారు. తమ పేరుతో డిజైన్ టెక్, నాటి రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంతో తమకు సంబంధమే లేదని.. 90 శాతం గ్రాంట్–ఇన్–ఎయిడ్‌గా ఇస్తామని తాము ఎక్కడా చెప్పలేదని సెక్షన్–164 కింద న్యాయస్థానంలో సీమెన్స్ ప్రతినిధులు సాక్ష్యమిచ్చారు. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లను డిజైన్ టెక్‌కు దోచిపెట్టి షెల్ కంపెనీల ద్వారా వాటిని చంద్రబాబు తిరిగి తన ఇంటికి తెచ్చుకున్నారు. దేశ చరిత్రలో అత్యంత దారుణమైన ఆర్థిక నేరమిది. ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసిన సీఐడీ విభాగం కోర్టులో అఫిడవిట్లు దాఖలు చేసింది. చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారనడానికి బలమైన సాక్ష్యాధారాలు లభించడంతోనే ఆయన్ను అరెస్టు చేసింది. ఇందులో ఎలాంటి కక్ష సాధింపులు లేవు.

చట్టం ముందు అందరూ సమానులే..

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనను అరెస్ట్ చేస్తారని చంద్రబాబుకు ముందే తెలుసు. తనపై నేరారోపణ బలంగా ఉందని తెలుసు. అందుకే వారం క్రితమే తనని అరెస్ట్ చేస్తారని ప్రకటించారు. ఒకవేళ అరెస్ట్ జరగకపోతే తాను నిజాయితీపరుడిని కాబట్టే అరెస్టు చేయలేదని చెప్పుకునే ప్రయత్నం చేశారు. చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేశారంటూ ఆరోపణలు చేయడం విడ్డూరం. బాగా తెల్లవారిన తర్వాతే ఆయన్ను అరెస్టు చేశారు. తమిళనాడులో కరుణానిధిని అరెస్టు చేసినట్లుగా అర్ధరాత్రి వెళ్లి లేపి అరెస్టు చేయలేదు. చట్టం ముందు యువకుడైనా, వృద్ధుడైనా ఒకటే. ఆర్థిక నేరానికి పాల్పడ్డ కేసులో నిందితుడిని అరెస్టు చేయడానికి ముందు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎఫ్ఐఆర్‌లోనే అన్నీ ఉంటే ఇక విచారణ ఎందుకు? సీఐడీ దర్యాప్తులో తీగ లాగితే డొంకంతా కదిలి చంద్రబాబు వద్దకు చేరింది. అందుకే ప్రధాన నిందితుడిగా చేర్చి అరెస్టు చేశారు. కక్ష సాధింపులు చంద్రబాబుకే అలవాటు. వాటిని సీఎం జగన్‌కు ఆపాదిస్తే ఎలా? తన తండ్రి చంద్రబాబును పరామర్శించేందుకు లోకేష్ వెళ్తే ఎందుకు రానివ్వరు? అక్కడకు వెళ్లి రచ్చ చేయాలని చూస్తేనే సమస్య.

హఠాత్తుగా అనారోగ్యమా?

చంద్రబాబును న్యాయస్థానంలో సీఐడీ అధికారులు ప్రవేశపెడతారు. అవసరమైతే కస్టడీకి అడుగుతారు. అరెస్టు చేయగానే తనకు బీపీ ఉందని చంద్రబాబు అంటున్నారు. అనారోగ్యం సడన్‌గా వస్తుందా? నిన్నటి వరకూ గొంతెత్తి అరుస్తూ తిరుగుతున్నారే? ఉదయం లేవగానే హైపర్ టెన్షన్ ఎలా వస్తుంది? చౌకబారు రాజకీయ ఎత్తుగడలతో ఉపయోగం ఉండదు. టీడీపీ తన ఉనికిని ఎప్పుడో కోల్పోయింది. చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలు ప్రజల సమస్యలను మర్చిపోయారు. వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు కూడా ప్రజల గురించి ఆలోచించలేదు. ఇప్పుడు కూడా అంతే. ప్రజలను భ్రమల్లో పెట్టి అధికారంలోకి రావాలనుకున్నారు. గతంలో అలానే అధికారంలోకి వచ్చారు. సీఎం జగన్‌ను, వైఎస్సార్‌సీపీని దూషిస్తూ టీడీపీ బూతుల పార్టీగా మారింది. ఆ పార్టీకి ఓ స్పష్టమైన అజెండా అంటూ లేదు. సీఎం జగన్ చేస్తున్న మంచి పనులతో ప్రజల్లో మంచి స్పందన వస్తోంది. ఇది ప్రతి ఎన్నికల్లోనూ నిరూపితమవుతూనే ఉంది. వచ్చే ఎన్నికల్లోనూ అదే జరుగుతుంది.

తప్పుచేయని వారిని ప్రభుత్వం అరెస్టుచేస్తోంది

మీడియాకు వీడియో సందేశంలో పవన్‌కళ్యాణ్

- చంద్రబాబుకు జనసేన సంపూర్ణ మద్దతు
- రోడ్డు మార్గంలో విజయవాడ వచ్చేందుకు యత్నం
- జగ్గయ్యపేట వద్ద పోలీసుల అడ్డగింత
- రోడ్డుపైనే పడుకున్న జనసేన అధినేత..
- చివరికి పోలీసుల అదుపులో పవన్, నాదెండ్ల.. వాహనంలో అక్కడ నుంచి తరలింపు



రోడ్డుపై పడుకున్న పవన్‌కల్యాణ్

సాక్షి, అమరావతి/గన్నవరం/గరికపాడు (జగ్గయ్యపేట): తప్పుచేయని నేతలను ఈ ప్రభుత్వం అరెస్టు చేస్తోందంటూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టుపై ఆయన స్పందిస్తూ.. చంద్రబాబుకు జనసేన సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'ప్రాథమిక ఆధారాలు చూపించకుండా అర్ధరాత్రి అరెస్టు విధానాన్ని రాష్ట్రంలో అవలంబిస్తున్నారు. గతేడాది అక్టోబరులో విశాఖపట్నంలో కూడ జనసేనపట్ల పోలీసు వ్యవస్థ, ఈ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో అందరూ చూశారు. ఏ తప్పు చేయని మా పార్టీ నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టి అరెస్టుచేశారు. ఇప్పుడు చంద్రబాబు విషయంలో నంద్యాలలో జరిగిన సంఘటన కూడా అలాంటిదే. ఆయన అరెస్టును జనసేన ఖండిస్తోంది. ఒక నాయకుడు అరెస్టయితే, ఆయనకు మద్దతుగా పార్టీ అనుచరులు, వాళ్ల పార్టీ క్యాడర్ కచ్చితంగా బయటకొస్తారు. అది ప్రజాస్వామ్యంలో భాగం. వాళ్లు ఇళ్లలోంచి బయటకు రాకూడదనుకుంటే ఎలా? దీనిని కచ్చితంగా రాజకీయ కక్షసాధింపు చర్యగా చూస్తున్నాం' అంటూ పవన్ వ్యాఖ్యానించారు.

పవన్ ప్రత్యేక విమానం ల్యాండింగ్‌కు అనుమతి నిరాకరణ..

ఇక పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానం ల్యాండింగ్‌కు గన్నవరం ఎయిర్‌పోర్ట్ అధికారులు అనుమతి నిరాకరించారు. తొలుత కృష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌కు శాంతిభద్రతల సమస్యను వివరిస్తూ విమానం ల్యాండింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దని లేఖలో కోరారు. దీంతో ఎయిర్‌పోర్ట్ అధికారులు అనుమతివ్వలేదు. మరోవైపు.. చంద్రబాబు అరెస్టుకు సంఘీభావం తెలపడానికి పవన్ కళ్యాణ్ విజయవాడ రావడానికి ప్రయత్నిస్తే హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లోనే పోలీసులు అడ్డుకున్నారని గన్నవరంలో జనసేన నేత నాదెండ్ల ఆరోపించారు.

రోడ్డుపై పడుకుని పవన్ నిరసన

అరెస్టయిన చంద్రబాబుకు సంఘీభావం తెలిపేందుకు పవన్ శనివారం రాత్రి విజయవాడ చేరుకునేందుకు రోడ్డు మార్గాన బయల్దేరారు. దీంతో ఆ పార్టీ నేతలు నాదెండ్ల మనోహర్ సహా కొందరు కార్యకర్తలు జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్దకు చేరుకున్నారు. అయితే, పవన్‌ను గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ నుంచి విజయవాడకు బయల్దేరినప్పటికీ, ఆ తర్వాత మరోసారి అనుమంచిపల్లి వద్ద పోలీసులు నిలువరించారు. ఆంక్షల నేపథ్యంలో అనుమతిలేదని పోలీసులు ఎంత నచ్చచెప్పినప్పటికీ పవన్ వినకపోవటంతో పాటు ఆయన మొండిగా రోడ్డుపై పడుకున్నారు. దాదాపు రెండు గంటలపాటు ఇలా హైడ్రామా నడిచింది. చివరికి ఆయనతోపాటు నాదెండ్ల మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంలో తరలించారు. వీరిని ఎక్కడికి తరలిస్తున్నదీ పోలీసులు వెల్లడించలేదు. మరోవైపు.. పవన్, ఆ పార్టీ శ్రేణుల తీరుతో జాతీయ రహదారికి ఇరువైపుల ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌ను చిల్లకల్లు మీదుగా విజయవాడకు పోలీసులు తరలించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'ఫైబర్‌గ్రిడ్'లోనూ అదే స్కిల్

- టెరాసాఫ్ట్ పేరుతో రూ.284 కోట్లు కొట్టేసిన లోకేశ్ సన్నిహితులు
- నెట్సాప్ పేరుతో డొల్ల కంపెనీ సృష్టించి కొట్టేసిన వేమూరి హరికృష్ణ
- ఫైబర్‌గ్రిడ్ కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు
- ఇప్పటికే ఈ కేసులో నలుగురు సూత్రధారుల అరెస్టు
- త్వరలో కీలక సూత్రధారుని అరెస్టుకూ రంగం సిద్ధం

కదిలిన అవినీతి పునాది!

- తాత్కాలిక భవనాలు, పేదల టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో చంద్రబాబు లూటీ
- ఈ కుంభకోణాలను సాక్ష్యాధారాలతో వెల్లడించిన ఆదాయపన్ను శాఖ
- షాపూర్జీ పల్లోంజీ, ఎల్అండ్‌టీ నుంచి రూ.118.98 కోట్లు కొట్టేసిన బాబు
- డొల్ల కంపెనీల ద్వారా ముడుపుల తరలింపు
- పార్టీ ఫండ్ రూపంలో కాకుండా నేరుగా నగదు కావాలని డిమాండ్

టిడ్కో ఇళ్లకూ రూ.8,929 కోట్ల 'టెండర్'

- ఐదు లక్షల మంది పేదలను దోచుకునేందుకు స్కెచ్
- 2,08,160 టిడ్కో యూనిట్ల కాంట్రాక్టును ఎనిమిది సంస్థలకు కట్టబెట్టిన వైనం
- చ.అ. నిర్మాణ వ్యయం రూ.వెయ్యిలోపే ఉంటే.. రూ.2,203 చెల్లింపు
- అధికంగా ముడుపులు ఇచ్చిన సంస్థకు ఎక్కువగా చెల్లించిన బాబు
- నిర్మాణ సంస్థను బట్టి రూ.2,534.75 నుంచి రూ.2,034.59 చెల్లింపు

వనపర్తి విద్యార్థికి కేటీఆర్ అభినందన



వనపర్తి: జిల్లాకేంద్రానికి చెందిన పదవ తరగతి విద్యార్థి ప్రణవ శ్లోక ఇటీవల పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె ప్రాజెక్టు నిర్మాణం, ఉపయోగాలు, గతంలో పాలమూరులో ఉన్న కరువు ప్రభావంపై మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ కావటం.. ఆ వీడియో మంత్రి కేటీఆర్ వరకు వెళ్లింది. శనివారం ఈ వీడియోలో మాట్లాడిన విద్యార్థిని అవగాహనను ప్రశంసిస్తూ మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో అభినందించారు. ఈ ట్వీట్ రాష్ట్రవ్యాప్తంగా సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది.

3 కిలోల గంజాయి పట్టివేత?

వీపనగండ్ల: తూముకుంటకు చెందిన పేగిని శివ ఇంటికి ముగ్గురు వచ్చి, పాన్‌గల్ పోలీసులమని, భార్య పావనితో చెప్పి ఇంటిని తనిఖీ చేశారు. పొలం పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన శివను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. అతను గడ్డివాములో మూడు మూటల్లో ఉన్న గంజాయిని చూపించినట్లు తెలిపారు. ఆ వెంటనే బైక్‌పై ఎక్కించుకొని తీసుకెళ్లారన్నారు. పాలు విక్రయించి కుటుంబాన్ని పోషించే తన భర్తకు గంజాయి కేసుతో ఎలాంటి సంబంధం లేదని.. విడిచిపెట్టాలని పావని విజ్ఞప్తి చేసింది. తమకు ఈ విషయమై ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు సమాధానమిచ్చారు.

బండపై భోజనమే.. మహాప్రసాదంగా



బండపై భోజనం చేస్తున్న గ్రామస్తులు

దేశంలోని ప్రతి గ్రామానికి ఒక ఆచారం ఉంటుంది. ప్రాంతాన్ని బట్టి ఆచారాలు, నమ్మకాలు కొనసాగుతుంటాయి. అలాంటి వాటిలో ఒకటే మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలంలోని వెంకటగిరిలోనూ ప్రాచుర్యంలో ఉంది. వెంకటగిరి గ్రామ శివారులో కురుమూర్తి దేవస్థానం ఉంది. స్వామివారు అక్కడ కొలువుదీరే సమయంలో మొదటగా తమ గ్రామ పొలిమెరలో ఉన్న తొక్కుడు బండపై కాలు మోపారని గ్రామస్తుల నమ్మకం. ఇందులో భాగంగానే ప్రతి సంవత్సరం శ్రావణమాసం చివరి శనివారం గ్రామస్తులంతా కలిసి భజన కీర్తనలను ఆలపిస్తూ.. స్వామివారు కాలు మోపిన దగ్గర నిర్మించుకున్న ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామివారికి నైవేద్యం వడ్డించిన అనంతరం గ్రామస్తులందరూ కలిసి ప్లేట్లు, విస్తరాకులు లేకుండా బండరాయిపైన పెట్టిన భోజనాన్నే మహాప్రసాదంగా తింటారు. ఇలా చేయడం వల్ల గ్రామానికి, ప్రజలకు మంచి జరుగుతుందని పలువురు తెలిపారు.

– దేవరకద్ర రూరల్

వైభవంగా పాతర్లగడ్డ ఆంజనేయస్వామి జాతర

కోస్గి: పట్టణ శివారులోని పాతర్లగడ్డ ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రతి ఏటా శ్రావణ మాసంలో జరిగే ఈ జాతర ఉత్సవాలకు కోస్గితోపాటు తిమ్మాయపల్లి, సంపల్లి, పోతిరెడ్డిపల్లి, గుండ్లపల్లి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రైతులు ట్రాక్టర్లను అలంకరించి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయిస్తారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీషతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



జాతరలో భక్తులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, తదితరులు

రేపు మల్టీజోన్ ఐజీ షానవాజ్ ఖాసిం రాక



తాజాగా కొత్త కలను సంతరించుకుంటున్న పోలీస్‌స్టేషన్



నవాబుపేట పోలీస్‌స్టేషన్‌కు 33 సం.ల కిందట ప్రారంభించిన శిలాఫలకం

- 33 ఏళ్ల కిందట సెప్టెంబర్‌లో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన డీఐజీ
- ఇదే నెలలో రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారి రావడం ప్రత్యేకం



షానవాజ్ ఖాసిం, ఐజీ

నవాబుపేట: రాష్ట్ర స్థాయి పోలీసు అధికారి చేతుల మీదుగా 33 సంవత్సరాల కిందట సరిగ్గా సెప్టెంబర్‌లోనే పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ పోలీస్ స్టేషన్‌కు తాజాగా రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారి ఇదే నెలలో రావటం ప్రత్యేకంగా మారింది. నవాబుపేట పోలీస్‌స్టేషన్ 1983 మండల వ్యవస్థతో ఏర్పడింది. ఇక్కడ ఉన్న అవుట్ పోస్టులో అప్పటి వరకు జమేదార్(హెడ్‌కానిస్టేబుల్) నేతృత్వంలో పోలీస్‌స్టేషన్ కొనసాగింది. అనంతరం 1990 సెప్టెంబర్ 2న అప్పటి డీఐజీ కోటేశ్వర్‌రావు చేతుల మీదుగా కొత్త పోలీస్‌స్టేషన్ ప్రారంభమైంది. కాగా అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపుగా 23 మంది ఎస్ఐలు మారుతూ వచ్చారు. కాగా తాజాగా 11న(సోమవారం) మల్టీజోన్ ఐజీ షానవాజ్ ఖాసిం పోలీస్‌స్టేషన్ తనిఖీకి రానున్నారు. అందుకోసం స్టేషన్‌ని అన్ని రకాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఐజీ రాక కోసం చేస్తున్న ఈ ఏర్పాట్లను ఎస్పీ నరసింహ, డీఎస్పీ మహేష్, సీఐ స్వామి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

అన్ని రికార్డులు సిద్ధం చేసి ఉంచాం..



పోలీస్‌స్టేషన్‌లో అన్ని రకాల రికార్డులు సిద్ధం చేసి ఉంచాం. రాష్ట్ర స్థాయి ఉన్నత పోలీస్ అధికారి మారుమూల మండల స్థాయి స్టేషన్‌కు తొలిసారి వస్తున్నారు. కాగా దీన్ని టాస్క్ మాదిరిగా తీసుకుని ఏర్పాట్లు చేశాం. 33 ఏళ్ల కిందట ఇదే నెలలో డీఐజీ రాగా.. తాజాగా అదే నెలలో ఐజీ రావటం చాలా సంతోషంగా ఉంది.

– పురుషోత్తం, ఎస్ఐ నవాబుపేట

'నెట్టెంపాడు' నీటి పంపింగ్ ప్రారంభం

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడ్డెందొడ్డి లిఫ్ట్–1 వద్ద ఒక పంపును ప్రారంభించి నీటిని ఎత్తిపోస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. వారం రోజులుగా నిలిచిన ఎత్తిపోతల పథకం నీటి పంపింగ్ తిరిగి ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 7గంటల వరకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శనివారం సాయంత్రానికి 16,800 క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న మూడు యూనిట్లను నీటి కొరత కారణంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 94, ఎడమ కాల్వకు 640, కుడి కాల్వకు 920, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,339 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 9.275 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 116.196 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 10,500క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 25.65 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 10,124 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఈ ప్రాజెక్టు నుంచి ఎలాంటి అవుట్ ఫ్లోలు లేవని అధికారులు తెలిపారు.

సంకేసులకు ఇన్ ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వచ్చినట్లు జేఈ రాజు తెలిపారు. శనివారం ఎగువ నుంచి 1,810 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అదే నీటిని కేసీ కెనాల్‌కు మళ్లించినట్లు ఆయన తెలిపారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 292 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.90 మీటర్ల స్థాయిలో నీరు నిల్వ ఉంది.

మదనాపురం: మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయం శనివారం నాటికి నిండింది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా 774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా ద్వార వ్యవసాయ అవసరాల కోసం 800 క్యూసెక్కులు కుడి, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

నాలుగు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. శనివారం 4 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ కర్నాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరదనీరు స్వల్పంగా చేరుతుండడంతో ఎగువలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు, 79.142 ఎం.యూ., దిగువలో 2 యూనిట్ల ద్వారా 80 మెగావాట్లు, 84.813 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్‌ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 163.955 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించారు.

శ్రీశైలంలో 854.2 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 854.2 అడుగుల వద్ద 89.9 టీఎంసీల నీటినిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు నుంచి 2వేలు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,410, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. శ్రీశైలం జలాశయంలో 227 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

పాలమూరు ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరువు, వలసల జిల్లాగా జాతీయ స్థాయిలో ఖ్యాతికెక్కిన పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ ఈ నెల 16న పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలను ప్రారంభిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు పాలమూరు ప్రజలను ఓటు బ్యాంకుగానే చూశాయని తమ ప్రభుత్వం మాత్రం వారి సమస్యలు, కష్టాలను తీర్చడంపై దృష్టిసారించామని చెప్పారు. ఫలితంగా జిల్లాలో పంటలు పుష్కలంగా పండుతున్నాయని, పారిశ్రామిక రంగం అభివృద్ధికి కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని గమనించాలని, తెలంగాణ రాక ముందు.. వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బేరీజు వేసుకోవాలని కోరారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు చివరి దశలో ఉన్నాయని, రిజర్వాయర్ టన్నెల్‌ను సందర్శించి తమ అభివృద్ధిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే నివాసంలో లింబ్యాతండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.